సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 1 । మార్చి । 2024



బోరుమన్న విజయరాఘవపురం

మోతె శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారిలో ముగ్గురి అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. - 8లో



వీఐపీలు వస్తే..

యాదాద్రి ఆలయానికి ఎవరైనా వీఐపీలు వస్తే సామాన్యులను పట్టించుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - 8లో



గంజాయి విక్రేతల అరెస్ట్

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను గురువారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

గోదావరి జలాలు నిలిపివేత

అర్వపల్లి: ప్రస్తుత యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు వారబందీ విధానంలో వస్తున్న గోదావరి జలాలను గురువారం నిలిపివేశారు. మళ్లీ 5వ విడతలో ఈ నెల 8 నుంచి 15 వరకు వారం రోజుల పాటు జలాలు విడుదల చేస్తామని నీటిపారుదల శాఖ ఏఈ అమర్ తెలిపారు.

కనిపించని 'సమాచార' బోర్డులు



కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం వివరాలతో బోర్డులు లేని కార్యాలయాలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా కలెక్టరేట్‌లో కొన్ని శాఖల కార్యాలయాల ముందు సమాచార హక్కు బోర్డులు లేవు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రతి కార్యాలయం ముందు సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేసి అందులో సమాచారం అందించే అధికారుల వివరాలు ఉంచాల్సి ఉంది. కానీ అలాంటి ఏర్పాట్లు ఏమీచేయలేదు. ఒకే కాంపౌండులో దాదాపు 42 శాఖలు ఉంటే సుమారు 30కిపైగా సమాచార బోర్డులు లేవు. వెంటనే బోర్డులు ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

విత్తనాలు, ఎరువులు తగినంత సరఫరా చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి రైతులకు విత్తనాలు, ఎరువులు తగినంత సరఫరా చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్, 3వ స్థాయీ సంఘం చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ 3వ స్థాయీ సంఘం(వ్యవసాయం) సమావేశం వెంకటనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతుబంధు, గృహజ్యోతి పథకాలను నిరంతరం కొనసాగించాలన్నారు. పెన్‌పహాడ్ జెడ్పీటీసీ మామిడి అనిత మాట్లాడుతూ తండాల్లోని రైతులకు నాణ్యమైన కూరగాయల నారు, విత్తనాలు సబ్సిడీపై అందించాలన్నారు. కో ఆప్షన్ సభ్యుడు జానిమియా మాట్లాడుతూ చిలుకూరు మండలంలో గొర్రెల వ్యాధుల నివారణ మందులు సరఫరా చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ వివి అప్పారావు పాల్గొన్నారు.

టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడిగా అశోక్



అశోక్‌యాదవ్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కందగట్లకు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి భారీ అశోక్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమంలో అశోక్‌యాదవ్ చురుగ్గా పాల్గొన్నారు. అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతర సైనికుడిలా పోరాటం చేస్తానని, త్వరలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీ కమిటీలు, జిల్లా కమిటీలు, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి కల్పించడంతో పాటు ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు.

బీజేపీ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న చిల్లర రాజకీయాలను మానుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు ఇందారపు రాజమల్లయ్య హితవు పలికారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాయితీగా ప్రభుత్వాలను నడుపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ కు ఈడీ నోటీసులు జారీ చేయడం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో తక్కెళ్లపల్లి శ్యాం కుమార్, మెరుగు విక్ర మేందర్ కుమార్, సుంచు నరసింహ, ప్రశాంత్, గ్యార అంజయ్య, మహిళా కార్యదర్శి అనంతుల నవ్య శ్రీ, యూత్ సెక్రటరీ జిల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు 386

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు



- ఉమ్మడి జిల్లాలో 1,268, సూర్యాపేట జిల్లాలో 386 ఖాళీలు
- గత ప్రభుత్వంలో కంటే ఈసారి పెరిగిన పోస్టులు
- నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు
- జిల్లాలో 10వేల మందికి పైగానే టెట్ క్వాలిఫై అభ్యర్థులు
- 4వ తేదీ నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం

సూర్యాపేటటౌన్ : ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను గురువారం సీఎం విడుదల చేశారు. దీంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో 386 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. గత ప్రభుత్వం వేసిన డీఎస్సీ కంటే తాజాగా కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య పెరగడంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు.

4 నుంచి దరఖాస్తులు చేసుకునే అవకాశం

తాజాగా విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 4 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు ఫీజు రూ. వెయ్యిగా ప్రభుత్వం నిర్ణయించింది. గత ఏడాది దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదు. కొత్త డీఎస్సీకి వాటిని పరిగణనలోకి తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

పోస్టుల భర్తీకి కసరత్తు

జిల్లాలో మొత్తం 386 ఉపాధ్యాయ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా నింపనుంది. అందులో 86 స్కూల్ అసిస్టెంట్‌లు, 23 లాంగ్వేజ్ పండిట్లు, 5 పీఈటీలు, 224 ఎస్‌జీటీ పోస్టుతో పాటు స్కూల్ అసిస్టెంట్‌లు(స్పెషల్ ఎడ్యుకేటర్స్) 11, ఎస్‌జీటీ(స్పెషల్ ఎడ్యుకేటర్స్) 37 పోస్టులు భర్తీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు తగిన కసరత్తు చేస్తున్నారు.

10వేల మందికిపైగా టెట్ క్వాలిఫై..

జిల్లాలో గతంలో టెట్ రాసిన అభ్యర్థుల్లో 10వేల మందికి పైగా క్వాలిఫై అయిన వారు ఉన్నారు. వీరిలో పేపర్ 1, పేపర్ 2లో రెండింటిలో అర్హత సాధించారు. వీరంతా ఏళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టి పట్టణాలకు వెళ్లి కోచింగ్‌లు సైతం తీసుకొని డీఎస్సీ కోసం వేచి చూస్తున్నారు. 2017 తర్వాత ఇప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో వారి ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగాన్ని ఎలాగైనా సాధించాలనే తపనతో ఉన్నారు. కొందరు కోచింగ్‌లకు వెళ్లగా మరికొందరు స్వతహాగానే లైబ్రరీలకు వెళ్లి ప్రిపేర్ అవుతున్నారు.

జిల్లాలో 950 ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లాలో మొత్తం 950 ప్రభుత్వ జెడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 67వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే 3,968 మంది ఉపాధ్యాయయులు అవసరముండగా ప్రస్తుతం 3,224 మంది పని చేస్తున్నారు. ఇంకా 744 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గత ఏడాది అధికారులు తేల్చారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీల వివరాలు

కేటగిరీ	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి
స్కూల్ అసిస్టెంట్లు	128	86	84
లాంగ్వేజ్ పండిట్లు	28	23	21
పీఈటీలు	06	05	02
ఎస్‌జీటీలు	383	224	137
ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేటర్స్	13	11	10
ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేటర్స్	47	37	23
మొత్తం	605	386	277

గత ప్రభుత్వ హయాంలో 185 మాత్రమే..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో కేవలం 185 ఉపాధ్యాయ పోస్టులకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో స్కూల్ అసిస్టెంట్‌లు 80, లాంగ్వేజ్ పండిట్లు 23, పీఈటీలు 04, ఎస్‌జీటీలు 78 ఖాళీలు మాత్రమే ఉన్నాయి. దీంతో అప్పట్లో నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల్లో తీవ్ర నిరాశ కలిగింది. కాగా ప్రస్తుత ప్రభుత్వం దానిని రద్దు చేసి మళ్లీ మెగా డీఎస్సీ విడుదల చేయడంతో వారి ఆశలు పెరిగాయి. అయితే గతంలో కంటే ప్రస్తుత నోటిఫికేషన్‌లో ఎస్‌జీటీల సంఖ్య పెంచడంతో పాటు స్పెషల్ ఎడ్యుకేషటర్స్ పోస్టులను సైతం భర్తీ చేయనుంది.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగులకు మంచి అవకాశం. టెట్ క్వాలిఫై అయిన వారు కష్టపడి చదివి ఉద్యోగం సాధించి తమ లక్ష్యాన్ని చేరుకోవాలి.

– అశోక్, డీఈఓ

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకొస్తే చర్యలు

- కలెక్టర్ వెంకట్రావు



కోదాడ కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద సూచనలిస్తున్న కలెక్టర్

కోదాడఅర్బన్ : ఇంటర్ పరీక్ష కేంద్రాల్లోకి ఎవరైనా సెల్ ఫోన్ తీసుకొస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్. వెంకట్రావు హెచ్చరించారు. గురువారం కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థుల సంఖ్య, హాజరైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా పరీక్ష కేంద్రంలో 212 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఐదుగురు హాజరు కాలేదని కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. పరీక్ష కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి మాట్లాడారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదని ఈ నిబంధన విద్యార్థులతో పాటు అధ్యాపకులు, ఇతర పరీక్షల నిర్వహణ సిబ్బందికి కూడా వర్తిస్తుందన్నారు. ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కాగా పరీక్ష కేంద్ర వద్ద పోలీస్ బందోబస్తు, 144 సెక్షన్ అమలు, జిరాక్స్ సెంటర్ల మూసివేత తదితర నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జ్యోత్స్నను ఆదేశించారు. కలెక్టర్ వెంట కోదాడ తహసీల్దార్ సాయిగౌడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి రవికుమార్, కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్ ఉన్నారు.

మూడోసారి ప్రధాని మోదీనే



హుజూర్‌నగర్ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, చిత్రంలో బీజేపీ నేతలు

హుజూర్‌నగర్ : అవినీతి అక్రమాలకు తావులేని స్వచ్ఛమైన పాలన అందిస్తున్న నరేంద్ర మోదీ మూడో సారి ప్రధాని కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప బస్సు యాత్ర గురువారం రాత్రి హుజూర్‌నగర్ చేరుకుంది. ఈసందర్భంగా పాత బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు సాధించి బీజేపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్ల బీజేపీ పాలనలో తెలంగాణలో జాతీయ రహదారులు, విమానాశ్రయాలు నిర్మించారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకు సాధ్యంకాని ఆరు గ్యారంటీల హామీతో ప్రజలను మోసగించి రేవంత్ సీఎం అయ్యారని ఆరోపించారు. ఈయాత్రలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, నాయకులు హర్షవర్ధన్, జితేంద్రగుప్తా, సాంబయ్య, చల్లా శ్రీలత, అంబళ్ల నరేష్, వీరబాబు పాల్గొన్నారు.

రైతులు ఆనందంగా ఉండాలంటే బీజేపీ రావాలి

గరిడేపల్లి: రైతుల జీవితం ఆనందంగా ఉండాలంటే కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం రావాలని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చాక రైతుల జీవితాల్లో అనేక మార్పులొచ్చాయన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా యూరియా బ్లాక్‌లో కొనాల్సి ఉండేదన్నారు. నేడు రైతులకు సబ్సిడీలపై అనేక రకాల ఎరువులతో పాటు వ్యవసాయ యంత్రాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జ్ బండారు ప్రసాద్, మన్మథరెడ్డి, జిల్లా అధ్యక్షులు బొబ్బా భాగ్యరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా శ్రీలతరెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, మేకల వెంకటేశ్వర్లు, నర్సింగ్ అంజయ్య, విజయ్‌కుమార్, పలిశెట్టి అంజయ్య, రమేష్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌గా రాములు

నడిగూడెం : నడిగూడెం సహకార సంఘం నూతన చైర్మన్‌గా గుండెపూరి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత చైర్మన్ అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ జిల్లా సహకార సంఘం అధికారికి సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం అతనిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. సంఘం కార్యాలయంలో డీసీఓ ఎస్. పద్మ సమక్షంలో ఏర్పాటు చేసిన పాలక వర్గం సమావేశంలో రాములును చైర్మన్‌గా 10 మంది డైరెక్టర్లు చేతులు ఎత్తి ఎన్నుకున్నారు. మొత్తం 12 మంది సభ్యులుండగా 10 మంది మద్దతు పలికారు. ఈ సమావేశంలో సూర్యాపేట, కోదాడకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు పద్మజ, ఇందిర పాల్గొన్నారు.



చేతులెత్తి చైర్మన్‌ను ఎన్నుకుంటున్న డైరెక్టర్లు

380మంది విద్యార్థులు గైర్హాజర్



సూర్యాపేటలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

సూర్యాపేటటౌన్ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సంస్కృతం, తెలుగు పేపర్ పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 8,226 మంది విద్యార్థులకు 7,846 మంది హాజరు కాగా 380 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విభాగంలో 6,706 మంది విద్యార్థులకు 6,460 మంది హాజరు కాగా 246 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,520 మందికి 1386 మంది హాజరు కాగా 134 మంది పరీక్షకు హాజరు కాలేదు. డీఐఈఓ కృష్ణయ్యతో పాటు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పలు కేంద్రాలను తనిఖీ చేశారు. కోదాడలో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వెంకట్రావు తనిఖీ చేశారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

- ధరణిలో మార్పులకు మార్గదర్శకాలు జారీ
- కలెక్టర్ నుంచి అధికారాల బదలాయింపు
- మండలాల్లో ప్రత్యేక డ్రైవ్
- జిల్లాలో పెండింగ్‌లో 5,290 దరఖాస్తులు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈనేపథ్యంలో ధరణిలో మార్పులు తీసుకొచేందుకు చర్యలు చేపట్టింది. ఈమేరకు మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. ధరణి పోర్టల్‌కు సంబంధించి.. కలెక్టర్ల నుంచి తహసీల్దార్లు, ఆర్డీఓలకు అధికారాలు బదలాయించింది. స్థానిక రెవెన్యూ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుతో పాటు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించింది.

మాడ్యూల్	దరఖాస్తులు	పరిష్కారం	పెండింగ్
పట్టాదారు పాసు పుస్తకం కోసం	935	815	120
కోర్టు కేసులు అండ్ సమాచారం	2266	1964	302
పాస్‌బుక్ డెటా సవరణ	11,980	8,065	3915
కోర్టు కేసుల్లో పాస్‌బుక్ మంజూరు	818	735	83
ల్యాండ్ మ్యాటర్	9,195	8,650	545
ఇతర మాడ్యూల్స్	10,442	10,117	325
మొత్తం	35,636	30,346	5,290

చాలా దరఖాస్తులు పెండింగ్

భూ రికార్డుల ప్రక్షాళనకు గత ప్రభుత్వం 2020 అక్టోబర్‌లో ధరణి పోర్టల్ తీసుకొచ్చింది. ఈ పోర్టల్లో తలెత్తిన చిక్కుముళ్లతో చాలామంది రైతులు సతమతమవుతున్నారు. ముఖ్యంగా మిస్సింగ్ సర్వే నంబర్లు, భూవిస్తీర్ణంలో తేడాలు, నిషేధిత భూముల జాబితాలో నమోదవటం, వారసత్వ భూములు, మ్యుటేషన్లు, గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ తదితర మాడ్యూల్స్ వల్ల రైతులకు కష్టాలు ఎదురయ్యాయి. భూవిస్తీర్ణంలో తేడాల పరిష్కారానికి టీఎం-33 పేరిట కొత్త మాడ్యూల్ను అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదు. సుమారు జిల్లాలో 35,636 వేల దరఖాస్తులు అధికారులకు అందాయి. వీటిలో 5,290 దరఖాస్తులు పరిష్కారం కాలేదు. 2023 ఫిబ్రవరిలో ధరణి పోర్టల్‌తో పాటు భూసమస్యలకు పల్లెల్లోనే పరిష్కారం చూపాలని అప్పటి ప్రభుత్వం చూసినా ఫలితం దక్కలేదు. భూసమస్యల పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వం అడుగేయటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాలు విడుదల

ధరణి కమిటీ సభ్యుల సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో రెవెన్యూ శాఖను పటిష్ట పర్చాలని నిర్ణయించింది. తహసీల్దార్ నుంచి ఆర్డీఓలు, రెవెన్యూ అదనపు కలెక్టర్ల వరకు కీలక బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కలెక్టర్‌లకు మాత్రమే ధరణి బాధ్యతలు ఉండగా.. ప్రస్తుతం తహసీల్దార్లు, ఆర్డీఓలు, జిల్లా స్థాయి అధికారులు, సీసీఎల్ఏలకు అధికారాలు బదలాయింపు చేసింది. ఏ స్థాయి అధికారికి ఎలాంటి అధికారాలు ఉంటాయో మార్గదర్శకాల్లో వెల్లడించింది. మార్చి 1నుంచి 9 వరకు రెవెన్యూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించింది.

నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రైతుల భూ సమస్యల పరిష్కారానికి మండలాల్లో శుక్రవారం నుంచి 9 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. ధరణి సమస్యలపై గురువారం సాయంత్రం కలెక్టర్‌లో తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్ కోసం ప్రతి మండలంలో మూడు బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. ధరణి మాడ్యూల్స్‌ను అధికారుల వారీగా బదలాయించామన్నారు. తహసీల్దార్ల పరిధిలో అసైన్డ్ భూములు, వారసత్వం కోసం దరఖాస్తులు, ఖాతా విలీనం కోసం అందిన దరఖాస్తులు పరిష్కరిస్తారని, ఆర్డీఓ స్థాయిలో పాస్ బుక్ లేకుండా నాలా కోసం దరఖాస్తులు, కోర్టు కేసులు, పాస్ బుక్ డేటా మార్పు, చేర్పులు పరిష్కరిస్తారని, ఇతర మాడ్యూల్ పరిష్కారానికి తుది అధికారం కలెక్టర్‌కు ఉంటుందని వివరించారు.

భవితకు అందని భత్యం

- భవిత కేంద్రాల విద్యార్థుల అవస్థలు
- రెండేళ్లుగా ఎదురుచూపులు
- సుమారు రూ. 61.74 లక్షలు పెండింగ్
- సొంత డబ్బులతో రాకపోకలు



హుజూర్‌నగర్‌లోని భవిత కేంద్రం

హుజూర్‌నగర్ : దివ్యాంగ విద్యార్థులు కూడా చదువుల్లో రాణించి వారిని ఉన్నత స్థితికి చేర్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం భవిత కేంద్రాలను నెలకొల్పింది. కానీ ఆయా కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రెండేళ్లుగా ప్రయాణ భత్యం అందడం లేదు. ఫలితంగా వారు సొంత డబ్బులు పెట్టుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. డబ్బులు సరిపోక, సమయానికి అందక పోవడంతో కొందరు చదువులు మానేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

దివ్యాంగుల కోసం ఎన్నో వసతులు..

దివ్యాంగ విద్యార్థులకు వారానికోసారి ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తారు. రోజూ స్కూల్ రెడీనెస్ కార్యక్రమం చేపడుతారు. పూర్తిగా అంగ వైకల్యం ఉంటే ప్రతి శనివారం వారి ఇంటికి వెళ్లి పాఠాలు చెబుతారు. వినికిడి సమస్య ఉంటే ప్రతి నెలా సదరం శిబిరాలకు పంపిస్తారు. సాధారణ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సహాయం అందించేందుకు పాఠశాల సముదాయ సమావేశంలో ఉపాధ్యాయులకు అవగాహన కార్యకమాలు చేపడుతారు.

జిల్లాలో 28 భవిత కేంద్రాలు

జిల్లాలోని 23 మండలాల్లో 28 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 340 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి సంవత్సరం పది నెలల పాటు ఒక్కొక్కరి ఖాతాల్లో నెలకు రూ. 500 చొప్పున జమ చేయాలి, తల్లిదండ్రులకు సహాయ భత్యం కింద నెలకు రూ. 500 ఇవ్వాలి. బాలికలకు అదనంగా నెలకు స్టైఫండ్ రూ 200, రీడర్ అలవెన్స్ ఏడాదికి రూ. 600 చెల్లించాలి. గత ఏడాదికి సంబంధించిన 10 నెలల రవాణా భత్యం 273 మందికి సంబంధించి రూ. 13.57 లక్షలు, సహాయక భత్యం 162 మందికి సంబంధించి రూ. 8.91 లక్షలు, దివ్యాంగ బాలికలు 455 మందికి స్టైఫండ్ రూ. 9.09 లక్షలు, రీడర్ అలవెన్స్ 29 మందికి సంబంధించి రూ. 17 వేలు మొత్తం కలిపి రూ. 31.74 లక్షలు రావాల్సి ఉంది. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరం కూడా ముగుస్తున్నందున ఈ ఏడాదికి సంబంధించిన ప్రతిపాదనలు సైతం అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అన్నిరకాల అలవెన్స్‌లు కలిపి దాదాపు రూ. 30 లక్షల వరకు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం



దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాల్లో పూర్తి స్థాయి సేవలు అందిస్తున్నాం. విద్యార్థులకు గత ఏడాది రావాల్సిన బకాయిల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఈ ఏడాదికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే వాటిని వారి వారి అకౌంట్లలో జమ చేస్తాం.

– అశోక్, డీఈఓ

క్లుప్తంగా

కల్యాణోత్సవంలో పాల్గొన్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్

మోతె: మండలంలోని బుర్కచర్ల గ్రామంలో గురువారం సీతారామ కల్యాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ మందిరంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.18,63,680

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 16 రోజుల్లో రూ.18,63,680 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ కె. మహేంద్రకుమార్, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంట్‌లు ఇంద్రసేనారెడ్డి, శంకర్, రవీందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నర్సిరెడ్డి, రాజ్యలక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ కట్టలో క్షౌరకులుగా అవకాశం కల్పించాలి



ఈఓ రామకృష్ణారావుకు వినతి పత్రం ఇస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి దేవస్థానం కల్యాణ కట్టలో యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణులకు క్షౌ రకులుగా అవకాశం కల్పించాలని కోరుతూ ఈఓ రామకృష్ణారావుకు యాదాద్రి పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. గత అరవై ఏళ్లుగా కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, పట్టణ ప్రధాన రహదారి విస్తరణలో తాము అద్దెకు తీసుకున్న మడిగెలు స్వాధీనం చేసుకొని కూల్చివేయడంతో ఉపాధి కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణం లేక గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నామని, గత ప్రభుత్వం తమకు కల్యాణ కట్టలో క్షౌ రకులుగా ఉపాధి కల్పిస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. ఈ ప్రభుత్వమైనా కల్యాణ కట్టలో క్షౌరకులుగా పనిచేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు సంగం దశరథ, పసుపునూటి మురళి, పి. ప్రశాంత్, కృష్ణస్వామి, జానకిరాములు, విజయ్‌కుమార్, సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

నేడు ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం రాక

నల్లగొండ టూటౌన్: నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న బీజేపీ విజయసంకల్ప యాత్రలో పాల్గొనేందుకు శుక్రవారం ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రిజేష్ పాఠక్ నల్లగొండకు రానున్నట్లు బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం కోదాడ, సూర్యాపేట, నల్లగొండ నియోజకవర్గాల్లో విజయసంకల్ప యాత్ర కొనసాగనుందని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి తదితరులు యాత్రలో పాల్గొంటారని తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- నిందితుల నుంచి రూ.2.77లక్షల నగదు, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

నల్లగొండక్రైం: పార్కింగ్ చేసిన కార్ల అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన రావుల శంకర్ జనవరి 30వ తేదీన మిర్యాలగూడ మండలం అవంతీపురం సంతలో గొర్రెలను విక్రయించాడు. వాటిని అమ్మగా వచ్చిన రూ.97వేలను తన టాటా ఏస్ వాహనంలో పెట్టి అవంతీపురం మార్గంలోని ఓ హోటల్‌లోకి వెళ్లాడు. అతడు వచ్చేలోపు గుర్తుతెలియని వ్యక్తులు టాటా ఏస్ వాహనం అద్దాలు పగులగొట్టి నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం మిర్యాలగూడ పరిధిలో కోదాడ–జడ్చర్ల రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకొని తనిఖీ చేయగా.. కారు అద్దాలు పగులగొట్టేందుకు ఉపయోగించే పనిముట్లు, కొంత నగదు లభించాయి. పట్టుబడిన వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా బోగోల్ మండలం కప్రాలతిప్పకు చెందిన పిట్ట మహేష్, ఆవుల రాకేష్‌గా పోలీసులు గుర్తించారు. వారిని విచారించగా కార్ల అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. అవంతీపురం సమీపంలో టాటా ఏస్ వాహనం నుంచి కూడా నగదు చోరీ చేసింది తామేనని నేరం అంగీకరించారు. నిందితుల నుంచి రూ.2.77లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్ల డించారు. నిందితులపై మిర్యాలగూడ రూరల్, టూటౌన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వరి పొలంలో మొసలి ప్రత్యక్షం

- భయాందోళనకు గురైన రైతులు
- పట్టుకొని సాగర్ జలాశయంలో వదిలిన ఫారెస్ట్ అధికారులు



పంట పొలాల్లో ఉన్న మొసలి



మొసలిని పట్టుకుని తీసుకెళ్తున్న ఫారెస్ట్ అధికారులు

త్రిపురారం: మండల కేంద్రంలోని బెజ్జికల్ రోడ్డులో ముత్యాలమ్మ గుడి సమీపంలోని కొడి పెద్దులు వరి పొలంలో మొసలి ప్రత్యక్షమైంది. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతులు వరి పొలం దెబ్బతినడంతో అనుమానం వచ్చి వెతకడంతో మొసలి కనిపించిందన్నారు. దీంతో భయాందోళకు గురైన రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా.. మొసలిని పట్టుకొని నాగార్జునసాగర్ జలాశయంలో వదిలినట్లు ఫారెస్ట్ అధికారి ఆనంద్ తెలిపారు. అయితే బెజ్జికల్ రోడ్డులో ఉన్న త్రిపురారం చెరువులో మొసలి ఉందంటూ గత కొంతకాలంగా పశువుల కాసేందుకు వెళ్లిన రైతుల మాట్లాడుకుంటూ ఉన్నారు. అప్పట్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చెరువులో వెతికించినా మొసలి దొరకలేదు. అదే మొసలి ఇప్పుడు చెరువులో నీరు ఇంకిపోయేసరికి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలోకి చేరిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

బీబీనగర్: మండలంలోని ముగ్దుంపల్లి గ్రామ పరిధిలో గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల శివప్రసాద్(28) తన బైక్‌పై వెళ్తుండగా ముగ్దుంపల్లి శివారులోని రావిపహాడ్, గుర్రాలదండి వెళ్లే రోడ్డు మార్గంలోని సర్కిల్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివప్రసాద్‌కు తీవ్ర గాయాలవ్వడంతో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధి ఘట్‌కేసర్‌లోని ఆస్పత్రికి మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



నర్సింగ్ శేఖర్ మృతదేహం

హాలియా: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అనుముల మండలంలోని శ్రీనాథపురం స్టేజీ సమీపంలో 565వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన నర్సింగ్ శేఖర్(36), నర్సింగ్ రాములు కలిసి బైక్‌పై బుధవారం రాత్రి కనగల్ మండలం శేరిలింగోటం వద్ద జరిగిన ఫంక్షన్‌కు వెళ్లారు. రాత్రి ఇద్దరూ స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో అనుముల మండలం శ్రీనాథపురం గ్రామ శివారులోని బీపీడీ కాలేజీ వద్దకు రాగానే 565వ నంబర్ జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను నల్లగొండ నుంచి హాలియా వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరూ ఎగిరి రోడ్డుపై పడిపోయారు. బైక్ నడుపుతున్న శేఖర్ తలపగిలి అక్కడికక్కడే మృతిచెందగా.. వెనుక కూర్చున్న రాములుకి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హాలియా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన రాములును హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోదా ఆస్పత్రికి తరలించారు. శేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి అన్న పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాగేందర్, దాసు

నల్లగొండ టూటౌన్: ఢిల్లీలో శుక్రవారం నుంచి జరగనున్న అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు నల్లగొండ జిల్లాకు చెందిన మహేంద్రగిరి, సోని, మౌనిక, దీక్షిత ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దేశ నాగేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందికట్ల దాసు తెలిపారు. ఈ పోటీల్లో 11 దేశాల క్రీడాకారులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను గురువారం నల్లగొండ పట్టణంలో వారు సన్మానించారు. అదేవిధంగా ఎంపికైన క్రీడాకారులకు నల్లగొండ పట్టణంలోని సీకే ఆస్పత్రి అధినేత డాక్టర్ రవిప్రకాశ్ ఆర్థికసాయం అందజేసినట్లు వారు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్



పట్టుబడిన నిందితులను చూపుతున్న పోలీసులు

కోదాడరూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను గురువారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన గురుచరణ్ పాలిటెక్నికల్ చదివి కార్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. బాలకృష్ణ అలియాస్ సిద్దు డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఇద్దరూ గంజాయి మత్తుకు బానిసలై గతంలో పోలీసులకు పట్టుబడి జైలు జీవితం కూడా గడిపారు. జైలు నుంచి బయటకు వచ్చిన కొద్దిరోజుల వరకు బాగానే ఉన్నా.. ఇటీవల కోదాడ పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన అవిడి రాఘవ వద్ద గంజాయి కొనుగోలు చేసి కొంత తాగి మిగిలినది ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం గురుచరణ్, బాలకృష్ణ కలిసి రాఘవ వద్ద 250 గ్రాముల గంజాయిని రూ.2500కు కొనుగోలు చేసి కొద్దిగా తాగారు. మిగిలినది అమ్ముకునేందుకు గురువారం మేళ్లచెర్వు రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపంలో గల చింతచెట్టుకింద వచ్చారు. ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో పక్కా ప్రణాళికతో వారిని అదుపులోకి తీసుకొని రూ.2వేల విలువ చేసే 195 గ్రాముల గంజాయిని, ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురుచరణ్, బాలకృష్ణను రిమాండ్‌కు తరలించగా రాఘవ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కోదాడ పట్టణ ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఎల్లారెడ్డి, సతీష్, నాగేశ్వరరావు, ఆంజనేయులు కీలకంగా వ్యవహరించినట్లు సీఐ తెలిపారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు



రాధిక

నిడమనూరు: మండలంలోని రాజన్నగూడేనికి చెందిన వేలంపల్లి రాధిక మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. 2023 ఆగస్టులో ఆమె టీజీటీ, పీజీటీ, జేఎల్ (ఇంగ్లిష్) గురుకుల పరీక్షలు రాసింది. కాగా ఆమె పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్(జేఎల్) ఉద్యోగాలకు అర్హత సాధించింది. రాధిక ప్రస్తుతం నిడమనూరు మోడల్ స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్నారు. తన విజయంలో భర్త కలుకూరి రామయ్య ప్రోత్సాహం ఎంతో ఉందని రాధిక తెలిపారు.

చింతపల్లి మండల వాసికి..



స్వామి

చింతపల్లి: మండలంలోని సాయిరెడ్డిగూడేనికి చెందిన బొమ్మకంటి యాదయ్య, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు స్వామి ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్, పీజీటీ సోషల్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించడంతో పాటు డిగ్రీ లెక్చరర్‌లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించాడు. టీజీటీలో ఎంపికైనప్పటికి వదులుకున్నట్లు పేర్కొన్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన స్వామి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ బీఈడీ చదివాడు. స్వామి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

ఆత్మకూరు(ఎం): అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని పోసానికుంట వద్ద గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన గట్టు చందు(23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇసుక పోసానికుంట వైపు బునాది గాని కాల్వ కట్ట మీదుగా వెళ్తుండగా.. ట్రాక్టర్ అదుపుతప్పి కాల్వ కిందకు బోల్తా పడింది. సమీపంలోని రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను పక్కకు తొలగించగా అప్పటికే చందు మృతిచెందాడు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

యాదాద్రీశుడి సేవలో వేం నరేందర్‌రెడ్డి



వేం నరేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులకుకి ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనామూర్తుల చెంత ప్రత్యేక పూజలు చేశారు. వేం నరేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ రామకృష్ణారావు లడ్డూ ప్రసాదం అందజేశారు.

ప్రత్యేక రోజు.. ఒక్కటైన జంటలు

నాలుగేళ్లకు ఒకసారి వచ్చే లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి 29న గురువారం ఉమ్మడి జిల్లాలో కొన్ని జంటలు వివాహ బంధంలోకి అడుగుపెట్టాయి. వీరంతా నాలుగేళ్ల తర్వాత తమ మొదటి పెళ్లిరోజు చేసుకోనున్నారు. ప్రత్యేక రోజున పెళ్లి చేసుకోవడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.



అర్వపల్లి: ఒక్కటైన జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బట్టమేకల గణేష్‌యాదవ్, గరిడేపల్లి మండలం వెల్దండకు చెందిన కావ్య



అర్వపల్లి: పెళ్లితో ఒక్కటైన జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తూర్పాటి లింగమ్మ, సూర్యాపేటకు చెందిన పర్వతం ధర్మరాజు



మద్దిరాల: మండలంలోని కుక్కడం గ్రామానికి చెందిన కోట వైష్ణవి(అనూష), మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం గ్రామానికి చెందిన చక్రవర్తుల వరదరాజులు



మోత్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన క్రాంతికుమార్, నిజామాబాద్ పట్టణానికి చెందిన గాయత్రి దంపతులు



గుండాల: పెళ్లితో ఒక్కటైన మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన చంద్రగిరి అవినాష్‌కుమార్ గౌడ్, రేఖ



మునుగోడు: పెళ్లి చేసుకున్న మునుగోడు మండలంలోని కమ్మగూడేనికి చెందిన భార్గవి, నిడమనూరుకు చెందిన మనోహర్



నల్లగొండ పట్టణంలోని పోలీస్ ఆడిటోరియంలో వివాహ బంధంతో ఒక్కటైన కోమల్‌సాయి, సంధ్య



రామన్నపేట : మండల కేంద్రానికి చెందిన యోగిత(వందన), చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామానికి చెందిన బాతరాజు మహేష్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు

'లీప్' బేబీస్..

నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గురువారం లీప్ సంవత్సరం రోజున నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలకు చెందిన పూజిత, వేణు దంపతులకు జన్మించిన కుమారుడు





కట్టంగూర్‌కు చెందిన కావేరి, హనుమంతు దంపతుల కుమారుడు



కట్టంగూర్ మండలం పామనగుండ్లకు చెందిన శిరీష, శివకుమార్‌ల కుమార్తె



రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చిన భువనగిరి మండలం పెంచికల్‌పహాడ్‌కి చెందిన కృష్ణవేణి



మూడో కాన్పులో కుమార్తెకు జన్మనిచ్చిన భువనగిరి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన హన్మా సుల్తానా



మిర్యాలగూడ అర్బన్ : ఏరియా ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన త్రిపురారం మండల కేంద్రానికి చెందిన వి. మౌనిక

వీఐపీలు వస్తే సామాన్యులను పట్టించుకోరా!

- యాదాద్రిలో భక్తుల ఆగ్రహం



ఆచార్యుల కోసం వేచిచూస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి ఎవరైనా వీఐపీలు వస్తే ఆలయ అధికారులు, అర్చకులు సామాన్యులను పట్టించుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఓ వీఐపీ తన కుటుంబ సభ్యులతో గర్భాలయంలో స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందే రూ.600 టిక్కెట్ కొనుగోలు చేసి సువర్ణ పుష్పార్చన చేసేందుకు ఉత్సవమూర్తుల ముందు భక్తులు కూర్చున్నారు. భక్తులచే సువర్ణ పుష్పార్చన చేసే ఆచార్యులు గర్భాలయంలో వీఐపీ చేసే పూజల వద్దకు వెళ్లారు. దీంతో సుమారు 15 నిమిషాల పాటు భక్తులు వేచిచూడాల్సి వచ్చింది. అంతేకాకుండా గర్భాలయం నుంచి ఆ వీఐపీని భక్తుల మధ్యలో నుంచే అధికారులు, ఆచార్యులు సువర్ణ పుష్పార్చన చేసేందుకు తీసుకురావడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఆలయ అధికారులు, ఆచార్యులు వీఐపీలకు ఇచ్చిన ప్రాధాన్యత.. సామాన్యులకు ఇవ్వడం లేదని, ఈ తీరును మార్చుకోవాలని భక్తులు కోరుతున్నారు.

బోరుమన్న విజయరాఘవపురం



విజయరాఘవపురంలో నాగమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న బంధువులు, గ్రామస్తులు



కందుల నాగమ్మ (ఫైల్)



కందుల గుర్వయ్య (ఫైల్)

మునగాల: సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రం శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురి అంత్యక్రియలు గురువారం వారి స్వగ్రామాలైన విజయరాఘవపురం, రేపాలలో నిర్వహించారు. ఈ ప్రమాదంలో విజయరాఘవపురం గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు, ఓ పురుషుడు మృతిచెందిన విషయం విదితమే. వీరిలో ఇద్దరి అంత్యక్రియలు బుధవారం రాత్రే నిర్వహించారు. మరో ఇద్దరి అంత్యక్రియలు గురువారం విజయరాఘవపురంలో.. మరో మహిళ అంత్యక్రియలు రేపాలలో నిర్వహించారు. ఒకే రోజు గ్రామానికి చెందిన నలుగురు మృత్యువాత పడిన ఘటనను జీర్ణించుకోలేక విజయరాఘవపురం గ్రామస్తులు బోరున విలపించారు. అదే విధంగా ఈ ప్రమాదంలో గాయపడిన విజయరాఘవపురం గ్రామానికి చెందిన ఐదుగురు సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రేపాల గ్రామానికి చెందిన ఓ మహిళ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.

- రోడ్డు ప్రమాద మృతులకు ముగిసిన అంత్యక్రియలు

మృత్యువులోనూ వీడని బంధం

మునగాల మండలంలోని విజయరాఘవపురం గ్రామానికి చెందిన కందుల గుర్వయ్య(65), అతడి భార్య కందుల నాగమ్మ(60) మృత్యువులోనూ తమ బంధం వీడలేదు. బుధవారం జరిగిన రోడ్డు వీరిద్దరు మృతిచెందారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ముగ్గురి వివాహం చేశారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో కూలీ పనులు లేకపోవడంతో గత పది రోజులుగా మోతె మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి తోటలు, పత్తి చేలల్లో కూలీ పనులు చేసేందుకు వెళ్తున్నారు. ప్రమాదంలో గుర్వయ్య భార్య నాగమ్మ ఘటనా స్థలంలోనే మృతిచెందగా.. తీవ్ర గాయాలైన గుర్వయ్యను స్థానికులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.